# శశి

అంకితం: శ్రీ "భగ్నజీవి వర్మకే!"

ఇంట్లో యేమీ తోచక అప్పుడే బజారుకు వెళ్ళాను కాసేపు ఆ బజారు సందట్లో నైనా కాలనిగడిపి వద్దామని వెళ్ళాను. పగలంతా యీ చెవుల్లోగాని ఆ చెవుల్లోకి మంటలు మండుతూ కొడుతుండటం మూలాన ప్రాణంతాప మెత్తి అలిసిపోయింది. ఆ అలసట కాస్త తీర్చుకొందామని ఒక కూల్ డ్రింక్ ఒకటి సేవించి హోటల్లోనుంచి బయటికొచ్చి యెక్కడకు పోదామా అని ఆలోచిస్తూ నిలబడివున్నా. కాసేపు ఆలోచించి చివరకు రైల్వేస్టేషన్‌కు పోయి యేవైన క్రొత్త పుస్తకాలున్నయ్యేమో తెచ్చుకొందామని అనుకొని బయలుదేర బోతున్నాను. ఇంతలో సుమారు నెలా రెండు నెలల వయస్సుగల గడ్డంతోనూ, పీక్కుపోయిన కళ్ళతోనూ, నల్లగా మాడి వాడిపోయిన ముఖంతోనూ, మాసిపోయి చిరుగు పడుతున్న గుడ్డలతోను ఒకవ్యక్తి నాదగ్గరకొచ్చి "నీ పేరు రఘుపతి కాదూ?" అన్నాడు.

నేను ఆశ్చర్యపడి చూస్తున్నాను ఆ అవతారం చూస్తే పిచ్చివాడిలాగ వున్నాడు. నన్ను మాట్లాడిస్తున్నాడు. నాకేమీ తోచలేదు ఎవరయితే యేమిలే అని—

"అవును. నన్ను మీరెలా యెరుగుదురు?" అన్నాను.

నా చెయ్యి పుచ్చుకొని మళ్ళీ సంభాషణ ప్రారంభించాడు. నాకు చాల వింతగావుంది యీతని ధోరణి.

"ఓ! నిన్నెరగక పోవట మేమిటి? నా పేరు వర్మ కాదూ?.. మర్చిపోయావా అప్పుడే?...అవును నేనటువంటి శశే మర్చిపోగా లేనిది నీవు మర్చిపోవట మొకవింతా? నీతప్పేంది?... వెధవ ప్రపంచం!" అని వూరుకొన్నాడు.

నాకు ఆశ్చర్య మెక్కువైంది. ఈ వర్మ పేరు బాగా పరిచయం నాకు. అయినా యీవ్యక్తి ఆ వర్మేనా? గుర్తుపట్ట లేకుండవున్నాను. శశి అంటాడేమిటి? ఈ అవతార మేమిటి? అవి పదేపదే ఆలోచిస్తున్నా. విచిత్రంగావుంది. ఈ ముసుగులో గుద్దులాట చిదుకని—

నేటి సమాజమంతా స్వార్థత్రోను, దుర్మార్గంతోను నిండివుంది. సంస్కారానికి త్యాగానికి యెక్కడా తావులేదు. అలా సంస్కారం తెచ్చిద్దామని త్యాగంచేసే వాళ్ల జీవితాలు మట్టిపాలై పోతున్నాయ్. వాళ్ళ నాదరించే వాళ్లగాని, సహాయంచేసేవాళ్లగాని యెవ్వరూ లేరు.

అటువంటి దుష్ట భూయిష్టమైన నేటి మన ఈ సంఘంలో ప్రేమకోసం ప్రాకులాడి విఫలమైపోయి నిరాశతో కృశించి పోతున్న భగ్నజీవు లెందరో వున్నారు. ఈ కథ అంతా కల్పితం కాదు. సాధారణంగా కథ వ్రాస్తే దానికి మూలమైనా నిజమైన సంఘటననుంచి యెత్తుకొంటాం. ఈ కథ అలా కాకుండా మొదటినుంచి చివరి వరకు అంతా యదార్థంగా అక్షరం పొల్లుపోకుండా జరిగింది. రచన మాత్రం నాదిగాని కథ చరిత్రలోనిదే!

ఇందులో వుదహరింప బడ్డ వర్మవంటి నిర్భాగ్యులు, దౌర్భాగ్యులు యెంతమంది వున్నారో యింకా. ఇటువంటి మోసాలన్నిటినీ సంఘం గుర్తించి సరియైన మార్గానికి రాకపోతే యింకా యెంతమంది బలి కావలసివస్తుందో!

—కష్టజీవి

"వర్మా క్షమించు! నీ పూర్తి పేరేమిటో చెప్పు నీవెలా యెరుగుదువో చెప్పు. మర్చిపోయాను, చెప్పు యేమి అనుకోక." అని నేను అంటుండగానే అందుకొని,

నా పేరు వర్మ అంతే! మనిద్దరం క్లాసుమేట్స్. ఇంకా గుర్తురాలా? వర్మను పూర్తిగా మర్చిపోయావా? నీరూమ్ మేటును కూడాను...గుర్తురాలా? అని నావంక సమాధానం కోసం చూస్తున్నాడు.

అన్ని గుర్తులు చెప్పేసరికి జ్ఞాపక మొచ్చింది పూర్వ పరిచయమంతా. ఒకసారి అతని అప్పటి స్థితి పూర్వపు స్థితితో పోల్చి చూచేటప్పటికి కళ్ళ వెంబటి రెండు అశ్రువులు కారాయి.

"ఏంరా వర్మా! ఈవేష మేమిటి? ఈ అవతార మేమిటి? శశి యేమిటి? మనిషివి..."

నన్ను మాట పూర్తిచెయ్యనియ్యకుండా నేతాను అందుకొని, "కాలమే మార్చేస్తుందోయ్ మనుష్యుల్ని

(మిగత 16 వ పేజీలో)

[ 13-వ పేజీ తరువాయి ]

పశువులుగా. మనంచేసే దేమిటి పిడకలు?...పిచ్చివాడా!...అటువంటి శశే అలాచేసిందంటే ఈసమాజానికి యెంత శక్తివుంటే అలాజరిగి వుంటుందంటావ్? అది పోయిన తర్వాత యింకొకరితో నాకు లెక్కయేమిటి?...ఛీ!...వెధవ సమాజం. స్వార్థం...అంతా దుర్మార్గం! ద్రోహం! అబ్బబ్బా! యెంత మోసం!... ఆః! ఈ గ్రుడ్డి సంఘం నన్నేమి చేస్తుంది? శశి పోయిన తరువాత ఒకరితో పనేమిటి?...

అతను చెప్పిన మాటల్లో నాకు ఒకటైనా అర్థం కాలేదు. చుట్టూవున్న వాళ్లంతా ఈ సంభాషణవిని తెల్లపోయి నోరు తెరుచుకు చూస్తున్నారు. అతనివంక.

"ఏమోయ్ వర్మా! మాయింటికి వెడదాంరా!" అని వెంట పెట్టుకొని ఇంకేమి మాట్లాడకుండా ఇంటికి తీసుకు వెళ్ళాను. రైల్వే స్టేషనుకు వెళ్లదామనుకొన్న ప్రయాణం మళ్ళీ ఇంటికి తగిలింది వర్మపుణ్యమాఅంటూ.

ఇంటికొచ్చిన తర్వాత ముందు స్నానం చేయమన్నాను. ఎంత చెప్పినా స్నానం చెయ్యనంటాడు. అప్పటికి నెల్లా పదిహేను రోజులైందట స్నానంచేసి, సరిగా భోంచేసిన్నీ. మొత్తంమీద చాలసేపు వాదించి భిదిరించీ, బ్రతిమాలీ స్నానంచేయించాను: అంతలో భోజనం తయారయింది. భోజనానికి లేపాను మళ్ళీ బలవంతంమీద. "ఇక్కడ శశి లేదుగా యెవరు పెడ్తారు?" అన్నాడు. "మీ శశి బదులు మా హైమ పెడ్తుందిలే" అన్నాను నవ్వుతూ. మా శశికాంత కంటే మీ హైమ కాంతి గొప్పదా?" అన్నాడు.

"చూద్దువుగానిరా!" అన్నాను. భోజనానికి లేచాం. హైమ వడ్డించింది. భోంచేస్తూ హైమను చూచాడు. "ఎలావుంది" న్నాను "మాది వెండి మీది బంగారం" అన్నాడు. హైమకు ముందు ఇది అర్థం కాలేదు. తెల్లపోయింది. నావంక చురచుర చూచింది నేను నవ్వేసరికి. కోపంగా చూచి లోపలి కెళ్ళింది.

"శశీ నేనూ ఒకే కంచంలో తిని యెన్నాళ్ళయింది?" అన్నాడు. మా హైమ ఆశ్చర్యపోయింది ఇంకొక మానవజ డంబికారి వున్నాడని కాబోలు!

"శశి, శశీ అంటావు. ఎవరోయ్ ఆశశి?" అని నేనడిగాను. "మా శశి నా రాణి శశి! నా ప్రియురాలు శశి. నాపాద దాసి శశి. నాబహిః ప్రాణం శశి. నా జీవిత జ్యోతి శశిరేఖ." అని వూపిరాడకుండా చదివాడు.

"ఇదేమిటోయ్ మాయాబజారు లాగుంది?" అన్నాను.

మా హైమ తనలో తాను నవ్వుకుంటోంది బయటకు నవ్వితే వర్మ యేమను కొంటాడోనని. నాకు కూడ నవ్వొచ్చింది. నవ్వాను వర్మకూడనవ్వి, "అవును మాయాబజారే!" నన్నాడు.

"సరే! ముందు భోజనం కానియ్యి, తరువాత చెప్పుదువు కాని కథంతా" నన్నా. ఇంకేమి మాట్లాడకుండ భోంచేశాడు. ఇద్దరం చేతులు కడుగుకొని గదిలోకి వెళ్లాం. బజారునుంచి మూడు కిల్లీలు తెప్పించాను తాజాసరుకు. వాడిని చూచి మా శశి కిల్లీ కట్టిస్తే యెంత తియ్యగా, కమ్మగా వుండేదను కొన్నావ్ రఘూ!" "అన్నాడు. "ఎవరయ్యా బాబూ ఆశశి? దూంప తెంపేస్తున్నావే!" అన్నా. ఇందాక చెప్పాను కదూ? ఇంకా చెప్పాలా? అయితే విను...ఎవరికోసం పనితపించి పరితపించి ఇలా కృశించి పోయానో, ఎవరి మాటలు నమ్మి నాజీవితాన్ని అంధకార బంధురంగా చేసుకున్నానో, ఎవరికోసం తపించి అందరూ నన్ను పిచ్చివాడనుకొనే టంత పిచ్చి అవతారం వచ్చేదాకా మారిపోయానో ఆ శశి. నా శశి. నారాణి శశి."

ఇంతలో మా హైమకూడ తనపని పూర్తిచేసుకొని వచ్చింది ఈ వింతచరిత్ర వినేందుకు "అలాకాదు గాదుంప దెంపక ఆ కథేమిటో కాస్త విపులంగా చెప్పుదూ బాబూ?" అన్నాను.

"అలా అడుగు చెప్పుతాను. సావధానంగా వినండి" అని కిల్లీనోట్లో వేసుకొని నములుతూ, జేబులోని ఒక రికార్డుకట్ట తీశాడు బయటికి. అప్పుడే హైమకూడ కిల్లీవేసుకొంది. "ఇప్పటివరకూ వేసుకోకుండ పెట్టె పెట్టావేం కిల్లీ?" అని అడిగాను వర్మను. "బంతిలో వలపతీమా?" అన్నాడు. "అయితే నేను చేశానుగా!" అన్నాను. "ఆపాపం నీదే" అని ఒక కాగితం తీశాడు ఆకట్టలోనుంచి. దాన్ని చూపిస్తూ,

"ఈ వుత్తరం చూచేటప్పటికి కళ్లు జిగేల్ మన్నయ్. ఎక్కడనుంచి వచ్చిందో యెవరు వ్రాశారో తెలియదు. అలా అకస్మాత్తుగా యెప్పుడూ యెక్కడ

నుంచీ రావటం అలవాటులేదు. మనస్సు పరిపరివిధాల పోయింది. కాని యేవిధమైన నిర్ణయానికి రాలేకపోయాను. గుండె చాల వేగంగా కొట్టుకొంటోంది. అనేక ఆలోచనలు. ఉద్దేశ్యాలు బుర్రలో ఢీకొంటూయున్నాయి. మనస్సంతా చీకాకుగాయుంది. మొత్తంమీద యేది యెలాగున్నా ఆవుత్తరం తీసికొని చేత్తో పుచ్చుకొని ఆ అక్షరాల పొందిక, చక్కదనం: నా పేరు యితరులచేత—అంటే ఒక స్త్రీచేత యింత అందంగా, శ్రద్ధగా వ్రాయబడిందే అనే సంతోషంతో అలాగే నిలబడిపోయి చూస్తూయున్నాను. పదే పదే ఎంతసేపు చూచినా ఆ అక్షరాల సౌందర్యం తనివితీరడం లేదు. చివరకు హృదయాన్ని రాయిచేసుకొని భావాలను అడచిపెట్టి వుత్తరం విప్పాను చదవడానికి" అని ఆవుత్తరం విప్పవేసి, చదవడం మొదలుపెట్టాడు."

"ఆవుత్తరం యిది"

ప్రియమైన వర్మగారూ!

నమస్కారములు.

ఎందుకో మిమ్మల్ని చూస్తే నాకదోలాగు యుంటుంది. ఎన్నిసార్లు చూచినా చూడబుద్దేస్తుంది. ఎందువల్లో నాకు తెలియదు. అనేకసార్లు ప్రశ్నించాను. కాని కారణం తెలిసికోలేకపోయాను... మీరంటే...

ఇప్పటికి నాల్గయిదు రోజులనుంచి తమ దర్శనమే దొరుకుట చాల దుర్లభముగావుంది. ఇంతకాలం ఎలాగో ఓపికపట్టి కూర్చున్నాను. కాని యింక ఆగలేను. మీరు తప్పక నాయందు దయయుంచి రాత్రికి షుమారు ఏడున్నరకు మాతోటవద్దదక్షిణ వైపుమూలలో కలసుకోవలయును. నేను తప్పక నీకొరకై అక్కడ వేచియుండెదను. ఈయుత్తరం అందిన వెంటనే చూచుకొని చించివేయవలయును......నాకోర్కె విఫలము చేయవద్దు. మనం తోటవద్ద మాట్లాడుకుందాము. కాని యిక్కడ యింతకంటే యెక్కువ విషయములు వ్రాసి చేటభారతం చేయడం యిష్టములేదు. అనవసరం కూడాను.

ఇట్లు:
నీ ప్రియురాలు,
"శశి"

అదీ వుత్తరం. శశిని నేను బాగా యెరుగుదును. బాగా పరిచయంగూడా అయింది. మాయింటిప్రక్కనే వాళ్లయిలు. ఆశశి యేమిటి ఈవుత్తరం ఏమిటి? యిలా జరుగుతుందని యెప్పుడూ అనుకోలేదు. అవివాహిత. అందులో చదువుకున్నదికూడాను. అలా నా మనస్సు పరిపరివిధాల పోయింది. సరేతే రాత్రికిగదా అని ఊరుకున్నాను. యెలాగో చీకటిపడింది. అనిర్ణీత సమయానికి. నియమిత స్థలానికివెళ్ళాను. నేను వెళ్లేసరికే ఆమె హాజరయింది. నేను వెళ్లగానే కాగిలించుకొంది గట్టిగా...తరువాత ఆమె నన్ను ప్రేమించినట్లు నేనంటే ఆమెకు పంచప్రాణాలన్నట్లు, యింకా యింకా ఏమేమిటో చెప్పింది ఆవుద్రేకంలో. నేనంతా విని వూరుకున్నాను. నాకు తెలుసు యిదంతా మోహపుగాలని. అయినా ఆమె కోర్కెను నిరాకరించలేకపోయాను.

ఆవేళ ఆసంభాషణలతో మాత్రమే సమావేశం ముగిసింది. యిద్దరము వెళ్ళిపోయాం...

మళ్ళీ మర్నాడు యింకోవుత్తరంవచ్చిందిఇదిగో అది అని యింకో వుత్తరం తీసి చదవడం మొదలు పెట్టాడు,

"ప్రియా! వందనములు.

రాత్రియంతయు నాకు నిద్రలేదు. సంతోషసాగరంలో ప్రయాణంచేసితిని. నా ఆనందమునకు మితిలేదు. మనయిద్దరి సమావేశం చిరస్థాయిగానుండుగాక. బావా! నిన్ను మరువను. నన్ను మరువవద్దు. నీవే నా భర్తవు. నేనే నీ భార్యను. హృదయేశ్వరా! నిన్ను గాఢంగా ప్రేమించితిని. మరల నన్ను రాత్రిచోటనే కలసికొమ్మ...

ఇట్లు:
నీ హృదయేశ్వరి

సరే మళ్ళీ వెళ్ళా. ఈ నాటకం ఏమిటో చివరిదాకా చూద్దామని.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, నేను యెక్కువగా వాళ్లయింటికి వెళ్లుతూంటాను ఆఅమ్మాయి గూడా మా యింటికి వస్తూంటుంది. యిద్దరము చనువుగా మాట్లాడుకుంటాము గూడాను. అయినప్పటికిని ఈ విషయం యెప్పుడూ యెదుటపడి చెప్పిందికాదు ...సరే ఆరాత్రికూడా సమావేశమయ్యాం: ఆమె కామశాస్త్రోపాధ్యాయినివలె వుపన్యాసం దంచడం మొదలుపెట్టింది. నాకు నవ్వువస్తోంది. కాని యెంతో

బలవంతంమీద ఆపుకున్నాను. ఆమె చెప్పేదంతా ఊఁ కొడుతూమాత్రం వింటున్నాను చివరకు లోకాభిరామాయణం యెత్తుకొన్నాము. మావూరి రాజకీయాలనుగురించి కొంతసేపుముచ్చటించి తరువాత యిద్దరం యే పరిస్థితుల్లోను విడిపోగూడదని నిర్ధారించుకొన్నాము. నేను భయపడుతూనే మాట్లాడ్డాను. ఆ విషయం ఆమె గ్రహించి "యేంభయపడుతున్నార''ని అడిగింది.

"ఏమీలేదు. నీవెక్కడ? నేనెక్కడ? ఈ సమాజంలో మన దాంపత్యానికి తావుండదేమోనని భయం" అని నేనన్నాను. "ఏది యేమైన మనిద్దరి జీవితాలు రెండూ ఒకటే బావా!'' అని కౌగిలించుకొంది వూపిరాడకుండా. ఇంతలో యెవరో ఆవైపుకు వస్తున్నట్టు చప్పుడైంది. వెంటనే యిద్దరం తప్పుకొన్నాము చెరియొక వైపుకు.

ఆరాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు. శశినిండు యవ్వనంలోవుండి మాట్లాడుతున్నది. ఆవుద్రేకం అలా అనిపిస్తుందేమో? ఆమె పెద్దపెద్ద షాహుకారు కూతురు. నేనేమో బిక్కాపకీరును. మాయిద్దరికీ ఈ దాంపత్యం యెలా పొసగుతుంది? నక్కకీ నాగలోకానికీ సంబంధమేమిటీ?...ఒకవేళ మేమిద్దరం మా తల్లితండ్రులనూ. వాళ్ళ తల్లినీ—అంటే తండ్రి వేడుకే!— వప్పించితే మాత్రం సమాజం యిష్టపడవద్దూ? ఈ స్వార్థసమాజంలో మాసంయోగం అసంభవమని నా అంతరాత్మ అవ్యక్తంగా దృఢంగా చెపుతోంది. కాని ఆ విషయాన్ని శశి అన్నమాటలతో పోల్చుకుంటే నా అంతరాత్మ ఓడిపోతుంది. అయినా నమ్మకమెక్కడాచిక్కటంలేదు శశిమాటల్లో. అటు శశిమాటలా త్రోసివేయలేకుండ వున్నాను. ఇటు ఆమె మాటలు నమ్మలేకుండ ఉన్నాను సమాజాన్ని చూచి. సందిగ్ధావస్థలోపడి పరితపించిపోయింది మనస్సు రాత్రంతా.

మళ్ళీ మరునాడు ఇంకో వుత్తరం వచ్చింది. ఇప్పటికి నేను సమాధాన మిచ్చాను. ఆ వుత్తరాలన్నీ చదివి విసుగు తెప్పించుట మెందుకు? "అని కొన్ని వుత్తరాలు తీసేశాడు. "ముఖ్యమైనవి మాత్రం చదివి నేనువ్రాసినవాటి సారాంశంమాత్రం చెప్పతానువినండి.

ఆ మరునాడు వ్రాసిన వుత్తరంలో ఆమెను మరిచిపోవద్దనీ, సంఘం యేమీ చేయలేదనీ, తాను సర్వం నామీదే నిలుపుకొని వుందనీ వ్రాసింది. నేను సమాజంలో యిటువంటి విషయం జరగటం కల్లనీ, యేమైన ఈసమాజంలో మంచిగా వుండి నలుగురికీ చెప్పి సవ్యంగావుంటేనే మనం వివాహం చేసుకొందాం లేకపోతే మానేద్దాం, అంతవరకూ అంటే భార్యాభర్తలయ్యేవరకూ శారీరక సంబంధం పెట్టుకో కూడదనీ వ్రాశాను. ఆదర్శంగావుండి సంఘానికి నీతి నేర్పాలని వ్రాశాను. ఆమె దాని కంగీకరించింది. కాని సమాజం యేపరిస్థితులలోనైనా అడ్డువచ్చిందంటే దాన్నిధిక్కరించి యైనా మావివాహం చేసుకోవాలని యెప్పుడైనా తాను సిద్ధమేననీ చెప్పింది.

కొన్నాళ్లు గడిచాయి ఆవిధంగా. నేను వాళ్లింటికి వెళ్ళటం సాగించాను యెక్కువగా. అక్కడ మనకు అడ్డదలేదు. ఆమె తల్లీ తమ్ముడూ కూడ నేనంటే యెంతో ప్రేమగా చూస్తారు. రాత్రిళ్లు పడకకూడ అక్కడే మొదలు పెట్టాను. రహస్యంగా కలుసుకొనే శ్రమ తప్పింది. ఉత్తరాల శ్రమకూడ తగ్గింది. మేమిద్దరం యే విషయాన్ని గురించైనా నిర్భయంగా యెప్పుడైనా మాట్లాడుకోవచ్చు. మమ్మల్నెవ్వరూ అడ్డుపెట్టే వాళ్లు లేరు. వాళ్లతల్లి మాకు ప్రోత్సాహ మిచ్చేది పైగా. తమ్ముడు శంకరం ఇంట్లో వుండేవాడు కాదు యెప్పుడూ వున్నా లెక్కలేదు. ఇంక పూర్తి స్వరాజ్యం. నేను రాజును ఆమె రాణి మాశశి సంగీతం యెంతో శ్రావ్యంగా పాడుతుంది. (తొక్కుడు హార్మోనియం, అబ్బా! యెంత బాగా వాయిస్తుందనుకొన్నావ్? మా ఇద్దరికీ పనేమీలేదు. తినటం ఆడుకోవటం పాడుకోవటం నిద్రపోవటం. ఉమ్రఖయ్యామ్ శిష్యులమయ్యాం ఆరోజులలో. కాకపోతే శారీరక సంబంధం మాత్రం లేదన్న మాటేగా?''

"అయితేవర్మా! మా,మాఅంటావ్ ఆమెపరాధీన అయినప్పుడు యింకామాయేమిటి?'' అన్నానుమధ్యలో.

"శశి ఇప్పుడు పరాధీన కాని మనయధీన కాదు. అయినా యెప్పుడూ నాదే శశి. ఎప్పుడైతే మేమిద్దరం ఒకటిగా కలిసి మెలిసి వున్నామో, నేనే ఆమె ఆమే నేనుగా పరిగణించి మెలిగామో, మాటలలో, చేతలలో ఆటలలో పాటలలో ఒకటిగా వున్నామో ఆ నాటినుంచి శశి నాదే. పరాధీన యెట్లా అవుతుందీ? శారీరకంగా పరాధీన యైందిగాని మానసికంగా నాదేగా! అందువల్ల ఆమెనాదే అవుతుంది'' అని వుపన్యసించాడు.

"సరే! కానియ్యి చెప్పు" అన్నాను.

[సశేషము]